క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కరించాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

గోదావరిఖని: సింగరేణి కార్మిక కుటుంబాలకు స్వచ్ఛమైన తాగునీరందించాలని కోరుతూ మార్చి 1న నిర్వహించే ధర్నా విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. బుధవారం జీడీకే–2, ఏరియా వర్క్‌షాప్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. మూడేళ్లుగా కార్మిక కుటుంబాలు ఇబ్బంది పడుతున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నాయకులు మెండె శ్రీనివాస్, పి.శ్రీనివాసరావు, వంగల రాములు, శంకర్, సమ్మయ్య, బీమానాయక్, కుమార్, సంపత్, జనార్దన్, బొంకూరు సురేశ్, చంద్రయ్య పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి


సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న డీఎఫ్‌వో శివయ్య, ఎంపీడీవో శశికళ

పాలకుర్తి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వ మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని జిల్లా అటవీశాఖ అధికారి, మండల ప్రత్యేకాధికారి శివయ్య కోరారు. బుధవారం పాలకుర్తి మండలం ఈసాలతక్కళ్లపల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. అంతకుముందు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్నాహ్న భోజన నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం పాఠశాలలో జాతీయ సైన్స్ డే సందర్భంగా నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. ఎంపీడీవో శశికళ ఉన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించండి

జ్యోతినగర్: రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని నేషనల్ యూత్ ప్రాజెక్టు రాష్ట్ర అధ్యక్షుడు కె.యాదవరాజు అన్నారు. బుధవారం ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లోని డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. యువత వాహనాలను నడిపే సమయంలో హెల్మెట్ ధరించడంతో పాటు భద్రతా సూచనలు పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులకు జ్ఞాపికలతో పాటు ప్రశంస పత్రాలు అందించారు. ప్రిన్సిపాల్ యుగంధర్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం పరిశీలన

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని బుధవారం జెడ్పీ సీఈవో నరేందర్ పరిశీలించారు. కార్యాలయంలోని పలు పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి మండలంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విధులు నిర్వహించే సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. అనంతరం సీఈవోను ఇంచార్జి ఎంపీడీవో ఉమేశ్, ఎంపీవో శేషయ్యసూరి, సినియర్ అసిస్టెంట్ వంశీ కృష్ణ, సిబ్బంది సన్మానించారు.

కుందారంలో ప్రమాదం.. మీర్జంటలో విషాదం


నిమ్మ రవి (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్: మీర్జంపేట గ్రామానికి చెందిన నిమ్మ రవి(35) గోడకూలి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం కుందారం గ్రామానికి చెందిన రవి.. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం మీర్జంపేట గ్రామానికి 15 ఏళ్ల క్రితం బతుకుదెరువు కోసం వలస వచ్చి హమాలీగా పనిచేస్తున్నాడు. మల్లన్న దేవుడికి బోనాలు చేసుకునేందుకు మంగళవారం భార్య కోమలతో కలిసి బైక్‌పై స్వగ్రామం బయలు దేరి వెళ్లాడు. అయితే, కుందారంలోని తన ఇంటిపైకప్పు కూలిపోవడంతో దానిస్థానంలో కొత్తగా రేకుల షెడ్డు నిర్మించేందుకు తన సోదరులు బాపు, శ్రీనివాస్‌తో కలిసి పనులు చేస్తున్నారు. చుట్టూ పెరిగిన ముళ్ల పొదలను ట్రాక్టర్ ద్వారా తొలగించే క్రమంలో డ్రైవర్ నిర్లక్ష్యంతో పాత ఇంటి గోడకూలి రవిపై పడగా తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మంచిర్యాలలో పోస్టుమార్టం తర్వాత శవాన్ని మీర్జంపేటకు తీసుకొచ్చి బుధవారం అంత్యక్రియలు జరిపించారు. మృతుడికి భార్య కోమల, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అందరితో కలివిడిగా ఉండే రవి మృతితో మీర్జంపేటలో విషాదం అలుముకుంది.

మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే కేసు నమోదు

- రామగుండం సీపీ శ్రీనివాస్

సుల్తానాబాద్‌రూరల్: చట్ట వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం సీపీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించడంతో పాటు క్రైమ్ రేట్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీసుస్టేషన్ ఆవరణలో సీఐ జగదీష్ ఆధ్వర్యంలో షటిల్ కోర్టు, క్రికెట్ ప్రాక్టీస్ కోర్టులను ఏర్పాటు చేయగా సీపీ ప్రారంభించారు. ప్రస్తుతం ఇంటర్ పరీక్షలు నడుస్తున్నాయని, ఎవరైనా మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇక్కడ గోదావరిఖని ఏసీపీ రమేశ్, ఎస్సైలు వినీత, సిబ్బంది ఉన్నారు.

ఠాణాను తనిఖీ చేసిన సీపీ


షటిల్ కోర్టును ప్రారంభిస్తున్న సీపీ శ్రీనివాస్

పాలకుర్తి: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం రాత్రి రామగుండం పోలీసు కమిషనర్ పి.శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో కేసుల వివరాలు, ఇతరత్రా అంశాలపై పోలీసు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్, పెద్దపల్లి సీఐ కృష్ణ, బసంత్‌నగర్ ఎస్సై స్వామి తదితరులు ఉన్నారు.

పరీక్ష కేంద్రం దొరక్క టెన్షన్

- క్యాంపస్ మార్చడంతో అయోమయానికి గురైన విద్యార్థులు
- 'ఖని'లో పరీక్ష కేంద్రాలను సందర్శించిన సీపీ ఎం.శ్రీనివాస్

గోదావరిఖనిటౌన్: గోదావరిఖనిలో బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఎగ్జామ్ సెంటర్ దొరక్క కొందరు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నగరంలోని కాకతీయ జూనియర్ కళాశాల యాజమాన్యం, పాత క్యాంపస్ నుంచి నూతన క్యాంపస్‌లోకి కాలేజీని మార్చడం, పాత కాకతీయ కళాశాల పేరుతో ఉన్న మరో క్యాంపస్‌లో గాంధీ కళాశాలను పరీక్ష కేంద్రంగా కేటాయించడంతో విద్యార్థులు అయోమయానికి, టెన్షన్‌కు గురయ్యారు. పరీక్ష రాయాల్సిన సెంటర్లను తెలుసుకొని హుటాహుటిన సెంటర్లకు చేరుకొని ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయంపై జిల్లా నోడల్ అధికారి కల్పనను వివరణ కోరగా, ఈ విషయం తమ దృష్టికి రాలేదన్నారు.

పరీక్ష కేంద్రాల సందర్శన

గోదావరిఖనిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీతోపాటు స్థానిక శారదానగర్‌లోని బాలికల జూనియర్ కాలేజీల్లో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాలను రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ సందర్శించారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పరీక్ష నిర్వహణకు అధికారులు తీసుకుంటున్న చర్యలను పర్యవేక్షించారు. ఎగ్జామ్ సెంటర్ అధికారులకు పలు సూచనలు చేశారు. పరీక్ష కేంద్రాల దగ్గర ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. పరీక్షా కేందాల దగ్గర 144 సెక్షన్ అమలులో ఉందని, సమీపంలోని అన్ని జిరాక్స్ కేంద్రాలు, ఇంటర్‌నెట్ సెంటర్లు మూసివేయాలని ఆదేశించారు.


విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

తొలిరోజు 81 మంది గైర్హాజరు..

గోదావరిఖనిలో ఇంటర్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గోదావరిఖని, రామగుండం, ఎన్టీపీసీ ప్రాంతాల్లోని ఏడు పరీక్ష కేంద్రాల్లో 81 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం


సుల్తానాబాద్: హాజరైన విద్యార్థులు


జూలపల్లి: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

సుల్తానాబాద్/కమాన్‌పూర్/జూలపల్లి/మంథని / కాల్వశ్రీరాంపూర్/ధర్మారం/ముత్తారం/ఓదెల: ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. 144 సెక్షన్ విధించడంతో పరీక్ష కేంద్రాల వద్ద గుంపులు లేకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జిరాక్స్ సెంటర్లను ముందే నోటీస్‌లు ఇవ్వడంతో పరీక్ష పూర్తయ్యే వరకుజిరాక్స్ సెంటర్ల మూసివేసి ఉంచారు. పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ పర్యవేక్షించారు. కొంత మంది విద్యార్థులు ఆలస్యంగా రావడంతో ఒక్క నిమిషం నిబంధన మేరకు పరీక్షకు అనుమతించలేదు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న 11 ట్రాక్టర్లు, జేసీబీ సీజ్

ధర్మారం: మండలంలోని కొత్తూరు గ్రామంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న 11 ట్రాక్టర్లు, ఒక జేసీబీని స్వాధీనం చేసుకుని తహసీల్దార్‌కు అప్పగించినట్లు ధర్మారం ఎస్సై సత్యనారాయణ తెలిపారు. తహసీల్దార్ రజిత ఆదేశాల మేరకు ఆర్ఐ అంజయ్యతో కలిసి అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు, జేసీబీని పట్టుకుని తహసీల్దార్ కార్యాలయంలో అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

రహదారి నిర్మించాలని ఆందోళన

పాలకుర్తి: మండలంలోని కుక్కలగూడూర్ గ్రామంలో పెండింగ్‌లో ఉన్న గ్రామ ప్రధాన రహదారిని నిర్మించాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానికులు ఆందోళన నిర్వహించారు. గ్రామ బస్టాండ్ కూడళి నుంచి ఇందిరమ్మ కాలనీ వరకు ప్రధాన రహదారి దాదాపు 300 మీటర్ల మేర రహదారిపై కంకర పోసి వదిలేశారు. దీంతో తీవ్రమైన దుమ్ము, ధూళి వస్తోందని స్థానికులు రహదారిపై బైకులు అడ్డుగా నిలిపి ఆందోళన చేపట్టారు. దీంతో రహదారిపై ఇరువైపులా ట్రాఫిక్ నిలిచింది. విషయం తెలుసుకున్న ఆర్అండ్‌బీ అధికారులు స్థానికులతో ఫోన్లో మాట్లాడి త్వరితగతిన పనులు ప్రారంభించి రహదారి నిర్మాణం పూర్తి చేయిస్తామని హామీ ఇవ్వడంతో స్థానికులు ఆందోళన విరమించారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళన చేపడుతామని గ్రామస్తులు హెచ్చరించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ఫెర్టిలైజర్‌సిటీ: మండలంలోని గుంటూరుపల్లి గ్రామంలో గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం మగువ ఆధ్వర్యంలో గుంటూరుపల్లి కమ్యూనిటీ హాలులో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మగువ అధ్యక్షురాలు డాక్టర్ టి.లక్ష్మీవాణి తెలిపారు. కంటిలో లోపాలు ఉన్నవారిని గుర్తించి లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం మగువ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి ఆపరేషన్ చేపిస్తామని పేర్కొన్నారు.

పొన్నంను విమర్శించే అర్హత బండికి లేదు

ఎలిగేడు: రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శించే అర్హత కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కు లేదని ఎలిగేడు మండల ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ నాయకుడు తాటిపల్లి సతీశ్ బాబు అన్నారు. ఆయన ఎలిగేడులో విలేకరులతో మాట్లాడుతూ పొన్నం ప్రభాకర్ ప్రజల సంక్షేమం, అభివృద్ధిపై అవగాహన కలిగి ఉన్న నాయకుడని, పదవి ఉన్నా.. లేకున్నా ప్రజలతో మమేకమై ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం

మంథని: ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా ప్రభుత్వం మరో రెండు పథకాలను మంగళవారం అమల్లోకి తీసుకువచ్చిన సందర్భంగా బుధవారం కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో స్వీట్లు పంచారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం దశలవారీగా పథకాలను పేదవారికి అందిస్తుందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని కోరారు. మంథని మున్సిపల్ కౌన్సిలర్ పెండ్రు రమాదేవి, సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, నాయకులు వొడ్నాల శ్రీనివాస్, పోలు శివ పాల్గొన్నారు.

సమ్మక్క జాతర హుండీల లెక్కింపు

జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్, తేలుకుంటలో నిర్వహించిన సమ్మక్క, సారలమ్మ జాతరలో వచ్చిన హుండీల ఆదాయాన్ని జాతర కమిటీ సభ్యుల సమక్షంలో లెక్కించారు. అబ్బాపూర్ జాతరకు హుండీల ద్వారా రూ.1.56లక్షలు, షాపుల వేలం ద్వారా రూ.70వేలు ఆదాయం వచ్చింది. తేలుకుంట జాతరలో హుండీల ద్వారా రూ.60వేలు, దుకాణాల వేలం, ఇతరత్రా ఆదాయం రూ.50వేలు సమకూరినట్లు జాతర కమిటీ అధ్యక్షుడు పసునూటి శ్రీనివాస్, శేఖర్ వెల్లడించారు.

మున్సిపల్ సిబ్బందికి స్టీల్ ప్లేట్ల పంపిణీ

సుల్తానాబాద్: పట్టణంలోని గౌడ వీధిలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముత్యం సునీత భర్త రమేశ్ జ్ఞాపకార్థం మున్సిపల్ శానిటేషన్ 68మంది సిబ్బందికి స్టీల్‌ప్లేట్లను వారి సోదరుడు ముత్యం వినోద్ కుటుంబ సభ్యులు అందజేశారు.

అభివృద్ధి కోసమే పథకాలు

సుల్తానాబాద్‌రూరల్: నిరుపేదల అభివృద్ధి కోసమే పీఎం మోదీ పథకాలను అమలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాలారెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి, నీరుకుల్ల, గట్టెపల్లి గ్రామాల్లో బుధవారం బస్తి సంపర్గ్ అభ్యాస్‌లో భాగంగా ఇంటింటా కేంద్ర పథకాలపై ప్రచారం చేశారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు సంతోష్, శంకర్‌బాబు, బాలు, అనుదీప్, వెంకటేశ్, శంకర్, శ్రీనివాస్ ఉన్నారు.

వీధి కుక్కల బెడద తొలగించాలి

కమాన్‌పూర్: మండల పరిధిలో ఆందోళనకు గురిచేస్తున్న వీధికుక్కల బెడదను తొలగించడానికి తగు చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బోనాల వెంకటస్వామి బుధవారం ఇన్‌చార్జి ఎంపీడీవో ఉమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం బాపూజీ నగర్‌లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఆయన ప్రారంభించారు. గుర్రం లక్ష్మిమల్లు, గసిగంటి అజయ్, బొమ్మగాని అనిల్, దామెర సంపత్, గట్టయ్య, స్వామి, రవి, తిరుపతి ఉన్నారు.

రోడ్డుపై చెత్తవేస్తే జరిమానా


సూచనలు ఇస్తున్న కమిషనర్ శ్రీకాంత్

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ప్రాంతంలోని దుకాణదారులు రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా విధించక తప్పదని బల్దియా కమిషనర్ శ్రీకాంత్ అన్నారు. బుధవారం ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్ రోడ్‌లో పారిశుధ్య విభాగం పనితీరును ఆయన పరిశీలించారు. పారిశుధ్య విభాగం సిబ్బంది రికార్డులను పరిశీలించారు. శానిటరీ సూపర్‌వైజర్ సంపత్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

హైస్కూల్ సందర్శన

రామగుండం: అబాది రామగుండంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను బుధవారం జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి మహ్మద్ మెహరాజ్ మహమూద్ సందర్శించారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించే దిశగా చేపట్టాల్సిన చర్యలపై ఉపాధ్యాయులతో చర్చించారు.

ఆస్తా ప్రత్యేక రైలులో అయోధ్యకు..


భక్తులను తనిఖీ చేస్తున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు

రామగుండం: సికింద్రాబాద్ నుంచి అయోధ్య వెళ్లే ఆస్తా ప్రత్యేక రైలుకు రామగుండం నుంచి భారీగా భక్తులు తరలివెళ్లారు. ఉమ్మడి జిల్లా కేంద్రంలో కేవలం రామగుండంలో మాత్రమే హాల్టింగ్ కల్పించడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 285 మంది వెళ్లారు. వీరికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి, పాలకుర్తి జెడ్పీటీసీ, బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి వీడ్కోలు పలికారు. ఆస్తా ప్రత్యేక రైలులో ఆర్‌పీఎఫ్ సీఐ బుర్ర సురేశ్‌గౌడ్ నేతృత్వంలో ప్రతి బోగీలో భద్రతా ఏర్పాట్లపై పరిశీలించారు. ఆస్తా ప్రత్యేక రైలు ప్రతి బోగీకి భద్రతా అధికారిని ఏర్పాటు చేశారు.

కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించండి

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని పర్మినెంట్ కార్మిక సంఘం నాయకులు కేశోరాం కంపెనీ సీఎంవో యు.వి.రాజును కోరారు. బుధవారం కేశోరాం కంపెనీ గెస్ట్‌హౌస్‌లో కార్మిక సంఘం అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దాడి మహేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పర్శవేని శ్రీనివాస్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ ఆయనను కలిసి కార్మికుల సమస్యలపై చర్చించారు. కేశోరాం ప్లాంట్ హెడ్ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఆర్ మేనేజర్ గోవిందరావు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే లక్ష్యం

ముత్తారం: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తామని ముత్తారం పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి యాదగిరిరావు అన్నారు. బుధవారం ముత్తారం పీఏసీఎస్ కార్యాలయంలో నూతన ఎన్నికైన తాము, వైస్ చైర్మన్ ఏలువాక కొమురయ్యతో కలిసి ప్రమాణ స్వీకారం చేశారు. పీఏసీఎస్ సిబ్బంది, పాలకవర్గం సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు చైర్మన్, వైస్ చైర్మన్‌లను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు చొప్పరి సదానందం, నాగినేని జగన్‌మోహన్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, డైరెక్టర్లు గుజ్జ గోపాల్‌రావు, కొంకటి మల్లయ్య, మద్దెల వెంకటలక్ష్మిరాజయ్య, అల్లం నిర్మల, నాయిని పార్వతమ్మ, సీఈవో దాసరి ప్రసాద్ పాల్గొన్నారు.

బదిలీ వర్కర్ల డిజిగ్నేషన్ మార్పు

గోదావరిఖని: దేశవ్యాప్తంగా ఉన్న బదిలీవర్కర్లు, జనరల్ మజ్దూర్ల డిజిగ్నేషన్ మార్పునకు అవగాహన కుదిరిందని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు. బుధవారం జీడీకే–1వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. డిజిగ్నేషన్ మార్చాలని అనేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహించామని, దీని ఫలితంగా 6న జరిగిన స్టాండర్డైజేషన్ కమిటీ సమావేశంలో ఒక అవగాహనకు వచ్చిందన్నారు. తదుపరి సమావేశంలో కార్మికులకు సామాజిక హోదా కల్పిస్తూ ఆర్థిక ప్రయోజనాలు అందించేలా చూస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు ఆకుల హరిణ్, గంగిశెట్టి నరసింహులు, సతీశ్, నారాయణ చీకట్ల మల్లేశం, మునిగంట్ల మల్లేశ్, తిరుపతి పాల్గొన్నారు.


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సత్తయ్య

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం


పెద్దపల్లిరూరల్: స్టాళ్లను పరిశీలిస్తున్న డీఈవో


కమాన్‌పూర్: సైన్స్ మేళాలో సీఐ ప్రసాదరావు

పెద్దపల్లిరూరల్/జూలపల్లి/జ్యోతినగర్/గోదావరిఖనిటౌన్/కమాన్‌పూర్/రామగిరి/రామగుండం/పాలకుర్తి/కాల్వశ్రీరాంపూర్/రామగుండం/ముత్తారం: పెద్దపల్లి జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. పలు పాఠశాలలను డీఈవో మాధవి సందర్శించి విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లను తిలకించారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రదర్శనను అధికారులు, ఉపాధ్యాయులు పరిశీలించారు. సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస, రంగోళి పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు.


రామగుండం: విద్యార్థినుల ప్రదర్శన


ముత్తారం: కస్తూర్బాలో విద్యార్థుల ప్రదర్శన

ఓదెల వైస్ ఎంపీపీగా జీల తిరుపతి ఎన్నిక

ఓదెల: వైస్ ఎంపీపీగా శానగొండ గ్రామానికి చెందిన ఎంపీటీసీ జీల తిరుపతి బుధవారం ఎన్నికయ్యారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాల మేరకు వైస్‌ఎంపీపీ ఎన్నిక కోసం రిటర్నింగ్ అధికారి తిరుపతిరావు ఆదేశాలు జారీ చేశారు. బీఆర్‌ఎస్‌కు చెందిన ఎంపీటీసీలు కునారపు రేణుకదేవి, జీల తిరుపతి, ఆరెల్లి సరోజన, ఐరెడ్డి సరోజన, రెడ్డి స్వరూప, నోముల పద్మావతి, బీజేపీకి చెందిన కొలనూర్ ఎంపీటీసీ కారెంగుల శ్రీనివాస్ హాజరయ్యారు. కాంగ్రెస్‌కు చెందిన నలుగురు ఎంపీటీసీలు హాజరు కాలేదు. వైస్‌ఎంపీపీగా శానగొండ ఎంపీటీసీ తిరుపతిని ఎంపీపీ కునారపు రేణుకదేవి ప్రతిపాదించారు. మడక ఎంపీటీసీ నోముల పద్మావతి బలపరిచింది. మెజార్టీ బీఆర్‌ఎస్‌కు ఉండటంతో వైస్ ఎంపీపీగా జీల తిరుపతి ఎన్నికైనట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి తిరుపతిరావు ప్రకటించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి, జెడ్పీటీసీ గంట రాములుయాదవ్, ఎంపీడీవో తిరుపతి, సూపరింటెండెంట్ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ వెంకన్న పాల్గొన్నారు.


ఎన్నికపత్రం అందుకుంటున్న తిరుపతి

ఉత్సాహంగా సింగరేణి స్కూళ్ల వార్షిక క్రీడాపోటీలు

గోదావరిఖని: కంపెనీ స్థాయి సింగరేణి స్కూళ్ల వార్షిక క్రీడాపోటీలు బుధవారం స్థానిక జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో జరిగాయి. సంస్థవ్యాప్తంగా ఉన్న సింగరేణి పాఠశాలల విద్యార్థులు పోటీల్లో ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలను ఎస్‌వోటూ జీఎం రామ్మోహన్ ప్రారంభించగా, పరుగుపందెం, షాట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్, జావెలిన్‌త్రో, డిస్కస్‌త్రో, ఆర్చరీ, త్రోబాల్ పోటీలు రసవత్తరంగా సాగాయి.


విజేతలకు బహుమతి ప్రదానం

గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ కృషి

రామగిరి: గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఎంపీపీ ఆరెల్లి దేవక్క అన్నారు. బుధవారం మండలంలోని ఆదివారంపేటలో సీసీరోడ్డు నిర్మాణ పనులను ఉమ్మడి ముత్తారం మాజీ జెడ్పీటీసీ మైదం భారతితో కలిసి ప్రారంభించారు. నాయకులు మైదం బుచ్చయ్య, వేపచెట్టు రాజేశం, అత్తె తిరుపతిరెడ్డి, కన్నూరి నర్సింగరావు, ఎండీ ఇస్మాయిల్, చింతల కిషన్‌రెడ్డి, కోటి, ఓదెలు, రాజయ్య, విజయ పాల్గొన్నారు.

లద్నాపూర్‌లో..

మండలంలోని లద్నాపూర్ గ్రామంలో సీసీరోడ్లకు రూ.14లక్షల నిధులు మంజూరు కాగా బుధవారం కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రొడ్డ బాపు, ఓబీసీ మండల అధ్యక్షుడు బండారి సదానందం, యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్, నాయకులు తొగరి చంద్రయ్య, అద్దూరి ప్రవీణ్ పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ ఆరెల్లి దేవక్క

అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో వాహనాలు నడపడానికి డ్రైవర్లు, హెల్పర్లకు ఉద్యోగాలు పెట్టిస్తామని డబ్బులు వసూలు చేసిన అధికారులతోపాటు ఈ కుంభకోణంలో ఉన్న ప్రతి ఒక్కరిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు అంటేనే దళారులకు అక్షయపాత్రగా మారుతుందని, అధికారులు కూడా పరోక్షంగా దళారులకు సహకరించడం సరికాదన్నారు. ఉద్యోగాలు పెట్టిస్తామని డబ్బులు వసూలు చేసిన మున్సిపల్ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని, ఎవరైనా కార్పొరేటర్లు కూడా ఈ దందాలో ఉన్నట్లయితే నూతన మున్సిపల్ చట్టం ప్రకారం వారిపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌లోని అధికారుల అవినీతిపై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని పూర్తిస్థాయి విచారణ జరపాలని ఆయన కోరారు.

విద్యార్థులకు సైన్స్ ఫెయిర్ అవార్డు


అభినందిస్తున్న హెచ్‌ఎం అశోక్‌రెడ్డి

సుల్తానాబాద్: పట్టణంలోని సెయింట్ మేరీస్ హైస్కూల్ విద్యార్థులకు సైన్స్ ఫెయిర్ అవార్డు వచ్చిందని హెచ్‌ఎం అశోక్‌రెడ్డి తెలిపారు. బుధవారం అవార్డుతో పాటు నగదు రూ.10వేలు రాగా వారిని పాఠశాలలో సన్మానించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వారు 7వ తరగతికి చెందిన గౌరవ్ మాలిక్, 10వ తరగతికి చెందిన కనుకుల తేజస్వినికి ఇన్‌స్పైర్ అవార్డ్ అందజేశారు.